ప్రజాశక్తి
బుధవారం 19 మార్చి 2025 | 5 | కర్నూలు

ఆందోళనలో ‘వైద్య సేవ’

- ఇన్సూరెన్స్ విధానంతో ఉద్యోగ భద్రతపై అనుమానాలు
- 17 ఏళ్లుగా సమస్యలకు పరిష్కారం కరువు

కూటమి ప్రభుత్వం ఎన్‌టిఆర్ వైద్యసేవ స్థానంలో ఇన్సూరెన్స్ విధానాన్ని తీసుకురావాలని నిర్ణయించడంతో ఎన్‌టిఆర్ వైద్యసేవ సిబ్బందిలో ఆందోళన వ్యక్తం అవుతోంది. వారి ఉద్యోగ భద్రతపైనా అనుమానాలు తలెత్తాయి. 17 ఏళ్లుగా పని చేస్తున్నా వారి సమస్యలకు పరిష్కారం కరువైంది.

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

గతంలో ఆరోగ్యశ్రీ, ప్రస్తుతం ఎన్‌టిఆర్ వైద్యసేవ ట్రస్ట్‌లో పనిచేస్తున్న ఉద్యోగుల పరిస్థితి అత్యంత దారుణంగా మారింది. ఎన్‌టిఆర్ వైద్యసేవలో ఉద్యోగులుగా వైద్య మిత్రలు, టీం లీడర్లు, జిల్లా మేనేజర్లు, ఆఫీస్ అసోసియేట్లు, సిసి మానటరింగ్ డిఇలు పనిచేస్తున్నారు. కర్నూలు జిల్లాలో 96 మంది వైద్య మిత్రలు, ఏడుగురు టీం లీడర్లు, ఒక జిల్లా మేనేజర్ పని చేస్తున్నారు. నంద్యాల జిల్లాలో 66 మంది వైద్య మిత్రలు, ఆరుగురు టీం లీడర్లు, ఒక జిల్లా మేనేజర్ ఉన్నారు. ప్రస్తుత పరిస్థితిలో ఎన్‌టిఆర్ వైద్యసేవలో అందిస్తున్న వైద్యసేవలు ప్రజలకు అత్యంత కీలకంగా మారాయి. వైద్యం ఖర్చులు విపరీతంగా పెరిగిపోవడంతో డయాలసిస్, గుండె, ఎముకలకు సంబంధించిన అనేక ఆపరేషన్లు, క్యాన్సర్‌తోపాటు అనేక రోగాలకు వైద్యసేవ ట్రస్ట్ ద్వారానే వైద్యసేవలు జనం పొందుతున్న పరిస్థితి కొనసాగుతోంది. గత ప్రభుత్వం ఆరోగ్యశ్రీ పేరుతో ఈ పథకం కొనసాగించింది. ఎన్‌టిఆర్ వైద్యసేవ ట్రస్ట్ కింద కర్నూలు జిల్లా వ్యాప్తంగా 99 నెట్‌వర్క్ ఆస్పత్రులు ఉన్నాయి. వాటిలో 55 ప్రయివేటు ఆస్పత్రులు కాగా మిగతావి ప్రభుత్వ ఆస్పత్రులు ఉన్నాయి. ఎన్‌టిఆర్ వైద్యసేవ సక్రమంగా అమలు చేయడంలో అందులో పనిచేస్తున్న ఉద్యోగులదే కీలక పాత్ర. అలాంటి ఉద్యోగుల పరిస్థితి మాత్రం అత్యంత ఘోరంగా ఉందని చెప్పొచ్చు. ఎన్‌టిఆర్ వైద్యసేవలో చాలామంది 17 ఏళ్లుగా పనిచేస్తున్నారు. ఉద్యోగులకు ఇచ్చే జీతం మాత్రం రూ.15 వేలు కాగా, కటింగ్‌లు పోను చేతికొచ్చే జీతం రూ.13,080 మాత్రమే. ప్రస్తుతం కూరగాయల నుంచి నిత్యావసర ధరల వరకు ఆకాశాన్ని తాకుతున్నాయి. స్కూల్ ఫీజులు వంటివి అందనంత ఎత్తులో ఉన్నాయి. అయినప్పటికీ ఎన్‌టిఆర్ వైద్యసేవ ఉద్యోగుల జీతాలు మాత్రం పెరగడం లేదు. దీంతో ఆ శాఖ రాష్ట్ర ఉన్నతాధికారులను కలిసి విన్నవించుకున్నా సమస్యలకు పరిష్కారం దొరకని పరిస్థితి నెలకొంది. దీంతో తమ సమస్యల పరిష్కారం కోసం ఎన్‌టిఆర్ వైద్యసేవ ఉద్యోగులు నిరసన గళం విప్పారు.

పరిష్కారానికి నోచని కనీస డిమాండ్లు

ఎన్‌టిఆర్ వైద్యసేవలో పనిచేస్తున్న ఉద్యోగులు గొంతెమ్మ కోర్కెలు ఏమీ కోరడం లేదు. 17 ఏళ్లుగా పనిచేస్తున్న తమను ప్రభుత్వ కాంట్రాక్ట్ ఉద్యోగులుగా గుర్తించి జిఒ ఏడు ప్రకారం కేటగిరి-1 డిపిఒ (డిజిటల్ ప్రాసెసింగ్ ఆఫీసర్) క్యాడర్ అమలు చేయాలని కోరుతున్నారు. ఉద్యోగులు ఎవరైనా చనిపోతే వారి కుటుంబాలకు రూ.15 లక్షలు ఎక్స్‌గ్రేషియా, పదవీ విరమణ బెనిఫిట్స్‌గా రూ.పది లక్షలు ఇవ్వాలని, ప్రభుత్వ ఉద్యోగుల్లో వెయిటేజ్ కల్పించాలని కోరుతున్నారు. కనీస వేతనాలు అమలు చేయాలని, ఉద్యోగులకు అంతర్గత ప్రమోషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. ఎన్‌టిఆర్ వైద్యసేవలో పనిచేస్తున్న ఉద్యోగులు అడుగుతున్న డిమాండ్లు చాలా సాధారణమైనవని చెప్పొచ్చు. ఉద్యోగ భద్రత కల్పించాలని కోరడం ఏవిధంగా తప్పు అవుతుందో ప్రభుత్వం చెప్పాల్సి ఉంది. ఎన్‌టిఆర్ వైద్యసేవలో వైద్యం పొందే రోగులకు చేరినప్పటి నుంచి డిశ్చార్జ్ వరకూ అన్ని పనులు ఉద్యోగులే నిర్వహిస్తుంటారు. ఎంతోమంది రోగులకు సహాయకారిగా ఉంటూ అన్ని విషయాలూ తెలియపరుస్తూ అవగాహన కల్పిస్తారు. సామాన్య ప్రజానీకంతో పనిచేసే కీలకమైన ఉద్యోగులు వీరు. అలాంటి ఉద్యోగులకు సంబంధించిన కనీస సమస్యలను పరిష్కరించడం ప్రభుత్వ బాధ్యతగా చెప్పొచ్చు. ఇప్పటికైనా ప్రభుత్వం ఎన్‌టిఆర్ వైద్యసేవ ఉద్యోగులతో చర్చలు జరిపి సమస్యలను పరిష్కరించాల్సి ఉంది.

హెల్మెట్ వాడకంపై అవగాహన కల్పించాలి

- జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా

ప్రజాశక్తి- కర్నూలు కలెక్టరేట్

మాట్లాడుతున్న కలెక్టర్ పి.రంజిత్ బాషా

ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా వాడేలా అవగాహన కల్పించేందుకు జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్లో జిల్లా రోడ్డు భద్రత కమిటీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ట్రాఫిక్ రూల్స్ పై కూడా అవగాహన కల్పించాలన్నారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాల పరిసరాల్లో తప్పనిసరిగా హెల్మెట్ వాడేలా ‘నో హెల్మెట్ – నో ఎంట్రీ’ అనే బ్యానర్ లను ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఎల్లమ్మ తల్లి గుడి దగ్గర బ్రిడ్జి వర్క్ పూర్తి చేశారని, బ్రిడ్జి అప్రోచ్‌రోడ్డు కు సంబంధించి భూ సేకరణ త్వరగా పూర్తి కావాలన్నారు. కిడ్స్ వరల్డ్ నుండి రాజ్ విహార్ సర్కిల్ వరకు ఫ్రీలెఫ్ట్ ఏర్పాటుకు సంబంధించిన ప్రతిపాదనలను సిద్ధం చేయాలన్నారు. పెద్దపాడు నుండి హైదరాబాద్ ఎన్‌హెచ్‌కు లింక్ చేస్తూ ఔటర్ రింగ్‌రోడ్ ఏర్పాటుకు సంబంధించి ఎన్‌హెచ్ ,ఆర్ అండ్ బి, మున్సిపల్ శాఖల అధికారులు పరిశీలన చేసే నివేదిక పంపాలన్నారు. ప్రభుత్వ సర్వజన వైద్యశాల బయట ట్రాఫిక్ రద్దీ తగ్గించాలన్నారు. నగరంలో 156 సిసి కెమెరాలకు గాను 135 కెమెరాలను ఇన్‌స్టాల్ చేశారని, మరో 21 సిసి కెమెరాలకు సంబంధించిన లొకేషన్లలో కూడా ఏర్పాటు చేసే విధంగా దృష్టి సారించాలని ఆదేశించారు. ఎస్పి విక్రాంత్ పాటిల్ మాట్లాడుతూ ప్రజలు హెల్మెట్ ను ఉపయోగించేలా అవగాహన కల్పించడంలో భాగంగా ప్రభుత్వ కార్యాలయాల్లో, పెట్రోల్ షాపులలో నో హెల్మెట్ – నో ఎంట్రీ అని బ్యానర్లను ఏర్పాటు చేయాలన్నారు. గ్రామాల నుండి హైవేకు కనెక్ట్ అయ్యే అప్రోచ్ రోడ్ల వద్ద స్పీడ్ బ్రేకర్లు ఎక్కడ ఏర్పాటు చేయాలనే వివరాలు హైవే అధికారులకు అందజేశామన్నారు. సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, కర్నూలు ఆర్‌డిఒ సందీప్ కుమార్, ఆర్‌అండ్‌బి ఎస్‌ఇ మహేశ్వరరెడ్డి, పంచాయతీ రాజ్ ఎస్‌ఇ రామచంద్రారెడ్డి, డిటిసి శాంతకుమారి, ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ ఎఒ సింధు సుబ్రమణ్యం, నేషనల్ హైవే పిడి లు, తదితరులు పాల్గొన్నారు.

అప్పుడే దాహం కేకలు..!

వేసవి ప్రారంభంలోనే దాహం కేకలు వినిపిస్తున్నాయి. 20 రోజులుగా తాగునీరందక ‘దాహం.. దాహం’ అంటూ గ్రామస్తులు నీటి కోసం రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో చేపట్టారు. మండలంలోని కల్లుదేవకుంట గ్రామస్తులు మంగళవారం తాగునీటి కోసం రోడ్డుపై బైఠాయించడంతో జాతీయ రహదారి 167కు ఇరువైపులా వాహనాలు భారీగా నిలిచిపోయాయి. సమస్యను పరిష్కరించే వరకు ఇక్కడి నుంచి కదలబోమని మంత్రాలయం-ఎమ్మిగనూరు జాతీయ రహదారిపై దాదాపు 3 గంటల వరకు ఖాళీ బిందెలతో మహిళలు రోడ్డుపై ఆందోళన చేపట్టారు. దాదాపు 2 కిలోమీటర్ల వరకు వాహనాలు నిలిచిపోయాయి.

పన్నులు చెల్లించకపోతే ‘దుకాణాలు సీజ్’

- గృహాలకు తాగునీటి కొళాయి కనెక్షన్లు కట్ - వంద శాతం పన్నులు వసూలుకు యాక్షన్ ప్లాన్
- నగరపాలక అదనపు కమిషనర్ ఆర్జీవి కృష్ణ వెల్లడి - శ్రీచక్ర హాస్పిటల్లో బ్యానర్లు, ప్లకార్డులతో నిరసన

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

నగరపాలక సంస్థకు సంబంధించి ఆస్తి పన్ను, కొళాయి చార్జీలు, ట్రేడ్ లైసెన్స్ రుసుములను త్వరితగతిన చెల్లించకపోతే వాణిజ్య సముదాయాల దుకాణాలను సీజ్ చేస్తామని, గృహాలకు తాగునీటి కొళాయి కనెక్షన్లను కట్ చేస్తామని, నగరపాలక అదనపు కమిషనర్ ఆర్‌జివి కృష్ణ, గృహవాణిజ్య దుకాణాల యజమానులను హెచ్చరించారు. చెన్నమ్మ సర్కిల్ సమీపంలోని శ్రీచక్రహాస్పిటల్, నగరపాలకకు రూ.6.58 లక్షలు ఆస్తి పన్ను బకాయిలు చెల్లించేందుకు జాప్యం చేస్తుండటంతో మంగళవారం అదనపు కమిషనర్ అధ్వర్యంలో రెవెన్యూ సిబ్బంది ఆసుపత్రిలో బ్యానర్లు ప్లకార్డులతో శాంతియుతంగా నిరసన తెలిపారు. అదనపు కమిషనర్ మాట్లాడుతూ.. నగరంలో ఆస్తి, వ్యాపార వాణిజ్య దుకాణాలు, సముదాయాలు కలిగిన ప్రతి పౌరుడు సకాలంలో బాధ్యతాయుతంగా పన్నులు చెల్లించాలనారు. ఇందులో నిర్లక్ష్యం ప్రదర్శించడం తగదన్నారు. స్థానిక ప్రభుత్వం నుంచి నగరపాలకకు పన్నుల రూపంలో వచ్చిన నిధులతోనే నగరంలో మౌలిక వసతులను కల్పించడం సాధ్యం అవుతుందన్నారు. బకాయిదారులు పన్నులు త్వరితగతిన చెల్లించకపోతే, ఏ నోటీసు జారీ చేయకుండా దుకాణాలను సీజ్ చేస్తామని, గృహాలకు మంచినీటి కుళాయి కనెక్షన్లను తొలగిస్తామని స్పష్టం చేశారు. ఆస్తి పన్ను, తాగునీటి కొళాయి చార్జీల బకాయిదారులు, వాణిజ్య సముదాయ దుకాణ యజమానులు ట్రేడ్ లైసెన్స్ రుసుమును వెంటనే చెల్లించాలని సూచించారు. మొండి బకాయిలపై కఠినంగా వ్యవహరిస్తున్నామని, పన్నులను వంద శాతం వసూలుకు యాక్షన్ ప్లాన్ రూపొందించామన్నారు. నగర ప్రజలు పన్నులను జాప్యం చేయకుండా, సత్వరమే పన్నులను చెల్లించి నగరాభివృద్ధికి తోడ్పాటు అందించాలని అదనపు కమిషనర్ కోరారు. కార్యక్రమంలో ఆర్ఒ జునైద్, రెవెన్యూ ఇంస్పెక్టర్లు జిఎం. శ్రీకాంత్, సచివాలయ అడ్మిన్లు, తదితరులు పాల్గొన్నారు.

నిరసన చేపడుతున్న సిబ్బంది

ఇపిఎఫ్ పెన్షనర్లకు నెలకు రూ.9వేలివ్వాలి

- కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించాలి - కర్నూలు పిఎఫ్ ఆఫీస్ ముందు ధర్నా

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

ఇపిఎఫ్ పెన్షనర్లకు కనీస పెన్షన్ నెలకు రూ.తొమ్మిదివేలివ్వాలని, రైల్వేలలో రాయితీలు కల్పించాలని, ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని, ఉచిత వైద్య సౌకర్యం కల్పించాలని కోరుతూ మంగళవారం కర్నూలు పిఎఫ్ ఆఫీస్ ముందు ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఆల్ పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ సభ్యుడు కె. సుధాకరప్ప అధ్యక్షత వహించారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి.అంజిబాబు, బిఎస్‌ఎన్‌ఎల్ డాట్ పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర శాఖ అధ్యక్షులు ఎం.యాకోబు, మద్దిలేటి మాట్లాడుతూ కనీస పెన్షన్ రూ9,000 ఇవ్వాలని అనేక సంవత్సరాలుగా పెన్షనర్లు డిమాండ్ చేస్తున్నా పాలకులు ఇంతవరకు పట్టించుకునే దాఖలాలు లేవన్నారు. దేశవ్యాప్తంగా 196 రకాల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ రంగ పరిశ్రమలలో పనిచేసి పదవీ విరమణ చేసిన వారు 78 లక్షలు మంది ఉన్నారన్నారు. వారందరి ద్వారా 18 శాతం చొప్పున పిఎఫ్ వసూలు చేసి కార్పస్ ఫండ్‌కు జమ చేశారని, కోట్ల రూపాయలు ఇపిఎఫ్ దగ్గర నిల్వ ఉందన్నారు. దీనికి వచ్చే వడ్డీ రూపంలో ఇచ్చినా నెలకు ఒక్కొక్కరికి రూ.5000 చొప్పున ఇవ్వొచ్చని తెలిపారు. ప్రస్తుతం పెన్షన్ రూపంలో 25 శాతం మాత్రమే ఇస్తున్నారని ఇది చాలా అన్యాయమని అన్నారు. కనీస పెన్షన్ రూ.1000 పొందుతున్న వారు 37 లక్షల మంది మాత్రమే ఉన్నారని, ఇంకా లక్షల మంది ఎటువంటి పెన్షన్ పొందలేకపోతున్నారని, వారందరికీ కనీస పెన్షన్ నెలకు రూ 9000 ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఫిబ్రవరి 11, 12, 13 వ తేదీల్లో ఢిల్లీలో పార్లమెంటు బడ్జెట్ సమావేశాల సందర్భంగా మంగళవారం ఇపిఎఫ్ పెన్షన్ రూ 9,000 ఇవ్వాలని కోరుతూ జంతర్మంతర్ దగ్గర ధర్నా చేశామన్నారు. ఆ తర్వాత జరిగిన పార్లమెంట్ సమావేశంలో ప్రతిపక్ష నాయకులు అడిగిన ప్రశ్నలకు ఆర్థిక మంత్రి ఎలాంటి సమాధానం ఇవ్వలేదని తెలిపారు. 2014 ఎన్నికల కన్నా ముందు బిజెపి నాయకులు మేము అధికారంలోకి వస్తే కనీస పెన్షన్ ఇస్తామని వాగ్దానం చేసి ఇప్పటికి పది సంవత్సరాలు కావస్తున్నా పార్లమెంట్లో ప్రతిపక్ష నాయకులు అడుగుతున్నా ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ ఏ మాత్రం పట్టించుకునే పరిస్థితి లేదని వారు వాపోయారు. సామాజిక పెన్షన్లు రూ.4000 ఇస్తుంటే ఇన్ని సంవత్సరాల పాటు ప్రభుత్వానికి సేవలు చేసిన పెన్షనర్లకు ఎందుకు ఇవ్వడంలేదని వారు కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కె.నాగగోపాల్, టి.రామనాగిరెడ్డి, సూర్యనారాయణ, చెన్న కేశవులు, వెంకటేశ్వర్లు, ఎస్ఎ .కరీం, స్వామి దాసు, ఆనందరావు, శివశంకర్, మురళి మోహన్ రావు, టిఆర్‌ఎన్ రెడ్డి, అబ్దుల్ సుభాన్, పేపర్‌మిల్లు, బిఎస్‌ఎన్‌ఎల్ ఎంప్లాయిస్, ఆంధ్రా గ్లాస్ ఫ్యాక్టరీ వర్కర్స్, నంద్యాల పాల డైరీ కార్మికులు వివిధ ప్రభుత్వ ప్రైవేటు పరిశ్రమలలో పనిచేస్తున్న కార్మికులు పాల్గొన్నారు.

ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న అంజిబాబు

మత్తు పదార్థాలను నియంత్రించాలి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

జిల్లాలో గంజాయి సాగు, మత్తు పదార్థాల సరఫరా, వినియోగాన్ని పూర్తిగా నియంత్రించాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నార్కోటిక్స్‌కోఆర్డినేషన్ సమావేశాన్ని నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ యూనివర్సిటీలు, మెడికల్ కళాశాలలు, ఇతర కళాశాలల్లో మత్తు పదార్థాల వినియోగం లేకుండా అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. ఇలాంటివి ఏవైనా జరుగుతుంటే దాచి పెట్టవద్దని, విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన అంశమని, వెంటనే పోలీస్‌కు సమాచారం అందించాలని ఆదేశించారు. ప్రతి పాఠశాల, కళాశాలల్లో మత్తు పదార్థాల వినియోగం వల్ల జరిగే అనర్థాలు, టోల్ ఫ్రీ నంబర్ వివరాలతో శాశ్వతంగా ఉండే విధంగా హోర్డింగ్ లు ఏర్పాటు చేయాలని కలెక్టర్ డిఇఒను ఆదేశించారు. పొలాల్లో గంజాయి సాగు జరగకుండా చూడాలన్నారు. జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ మాట్లాడుతూ మత్తు పదార్థాల వినియోగానికి పాల్పడితే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, జిల్లా వ్యవసాయ అధికారి వరలక్ష్మి, జిల్లా విద్యాశాఖాధికారి శామ్యూల్ పాల్, ఆర్‌టిసి ఆర్‌ఎం శ్రీనివాసులు, అదనపు మున్సిపల్ కమిషనర్ ఆర్‌జివి.కృష్ణ, ఎక్సైజ్ సూపరిన్‌టెన్‌డెంట్ సుధీర్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

పిల్లల ఆధార్ నమోదును పూర్తి చేయాలి

0–5 సంవత్సరాల లోపు పిల్లల ఆధార్ వివరాల నమోదును పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆధార్ ఎన్‌రోల్‌మెంట్, ఆధార్ బయోమెట్రిక్ అప్డేట్ అంశాలపై సమావేశాన్ని నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ. జిల్లాలో 106 ఆధార్ కేంద్రాలు ఉన్నాయని, రోజుకు 20 చొప్పున నెలలోపు ఆధార్ ఎన్‌రోల్‌ను పూర్తి చేయాలని ఆదేశించారు. 15 నుండి 17 సంవత్సరాల మధ్య కూడా మరొకసారి కూడా అప్‌డేషన్ చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.

పాఠశాలల పనివేళలు మార్పు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

టెన్త్ పరీక్షలు నిర్వహిస్తున్న పాఠశాల పనివేళల్లో స్వల్ప మార్పులు చేసినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్‌పాల్ మంగళవారం ఉత్తర్వులను జారీ చేశారు. టెన్త్ పరీక్షా కేంద్రాలుగా ఉన్న పాఠశాలలో మధ్యాహ్నం ఒకటిన్నర గంటల నుండి 5 గంటల వరకు తరగతులను నిర్వహించాలని ఆదేశాల్లో పేర్కొన్నారు.

ఏప్రిల్ 22న రాష్ట్రస్థాయి క్రికెట్‌టోర్నీ

ప్రజాశక్తి-తుగ్గలి

తుగ్గలి మండల కేంద్రంలో ఏప్రెల్ 7 నుంచి వాల్మీకి మహర్షి విగ్రహ ప్రతిష్ట మహోత్సవాన్ని పురస్కరించుకుని బోయ వాల్మీకి సమితి తుగ్గలి గ్రామ యూత్ ఆధ్వర్యంలో టెన్నిస్ బాల్, క్రికెట్ టోర్నమెంట్ పోటీలు ఏప్రెల్ 22న నిర్వహిస్తున్నామని ఆర్గనైజర్స్ హంపయ్య, బివిఎస్ మండల అధ్యక్షులు చెన్నకేశవులు, ధనంజయ విలేకరులకు తెలిపారు. ఎంట్రీ ఫీజు కు ఆఖరి తేదీ ఏప్రిల్ 21 సాయంత్రం 5:00 గంటలలోపు చెల్లించాలన్నారు. గెలుపొందిన విజేతలకు మొదటి బహుమతి రూ.15000, రెండో బహుమతి రూ.10000 ఉంటుందన్నారు. టోర్నమెంట్ ఎంట్రీ ఫీజు చెల్లించేవారు 8790828889, 8466800698, 9666261658 నెంబర్లను సంప్రదించాలన్నారు.

రోడ్డు పనులను వెంటనే ప్రారంభించాలి

కేతవరం నుండి గార్గేయపురం వరకు సిపిఎం పాదయాత్ర

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

గార్గేయపురం నుండి కేతవరం పూడిచెర్ల మెట్టవరకు నిలిచిపోయిన రోడ్డు పనులను వెంటనే ప్రారంభించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి.రామకృష్ణ డిమాండ్ చేశారు. మంగళవారం సిపిఎం కేతవరం గ్రామ కమిటీ ఆధ్వర్యంలో కేతవరం నుండి గార్గేయపురం వరకు అస్తవ్యస్తంగా తయారైన రోడ్డు పనులను ప్రారంభించాలని కోరుతూ పాదయాత్ర నిర్వహించారు. పాదయాత్ర అనంతరం అక్కడే రోడ్డుపై రాస్తారోకోను నిర్వహించారు. స్థానిక నాయకులు జి.శ్రీధర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి.రామకృష్ణ, మండల కార్యదర్శి బి నాగన్న మాట్లాడారు. నాలుగైదు సంవత్సరాలుగా కేతవరం నుండి గార్గేయపురం వరకు రోడ్డు అస్తవ్యస్తంగా తయారై మోకాటి లోతు గుంతలు పడి వాహనదారులు ప్రయాణికులు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారన్నారు. కర్నూలు విజయవాడ హైవే అటు కర్నూలు నంద్యాల హైవే ఉండడంతో నిత్యం అనేకమంది బైకులు, ఆటోలు ఇతర వాహనాలు వెళుతూ వస్తూ ఉంటాయన్నారు. వాటితో పాటు కేతవరం ఆనుకొని ఎనిమిది వేల సంవత్సరాల క్రితం ఆదిమానవులు సంచరించిన ప్రాంతం ఉండటంతో అనేక ప్రాంతాల నుండి టూరిస్టులు వస్తూ ఉంటారన్నారు. చిన్న పిల్లలు వృద్ధులు గర్భవతులు వెళ్లాలంటే నరకం అనుభవించాల్సిందేనన్నారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే , ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు. రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించి వెంటనే ఆపేసారన్నారు. ముచ్చుమర్రి నుండి ఓర్వకల్‌కు పైప్ లైన్ నిర్మాణంలో భాగంగా ఈ రోడ్డు పనులను ఆపేశారన్నారు. తక్షణమే రోడ్డు నిర్మాణ పనులను చేపట్టకపోతే గ్రామస్తులతో కలిసి రోడ్డుపైనే నిరసన తెలుపుతామని హెచ్చరించారు. స్థానిక నాయకులు రంగస్వామి ,తెలుగు నాగమ్మ, సుబ్బరాయుడు, యువజనసంఘం నాయకు లు నరేష్ ,మద్దిలేటి, మధు, భరత్ గ్రామస్తులు రేమట సుబ్బరాయుడు,ఎ.మద్దిలేటి , శ్రీరాములు, రవి తదితరులు పాల్గొన్నారు.

పాదయాత్రను ప్రారంభించి మాట్లాడుతున్న జి.రామకృష్ణ

సూపర్ సిక్స్ పథకాల అమలెప్పుడు...?

కర్నూలు నగర పారిశుధ్యాన్ని కాపాడాలి-ప్రజాచైతన్య యాత్రలో సిపిఎం డిమాండ్

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

సూపర్‌సిక్స్ పథకాలు అమలు చేయాలని, కర్నూల నగరంలో చెత్తసేకరణ వాహనాలను పునరుద్ధరించి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. కర్నూలు బుధవార్ పేట 14,15,16 వార్డులలో ప్రజాచైతన్య యాత్ర సందర్భంగా ఆర్.కృష్ణ అధ్యక్షతన ప్రజల వద్దకు వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎండి.అంజిబాబు , సిపిఎం ఓల్డ్ సిటీ కార్యదర్శి ఎం.రాజశేఖర్, నగరకార్యవర్గ సభ్యులు ఎస్‌ఎండి షరీఫ్, డి అబ్దుల్ దేశాయ్, కె.రామకృష్ణ మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన 9 నెలలలో ప్రజలపై నిత్యవసర వస్తువుల ధరలు, కరెంట్ చార్జీలు ,ఇంటి పన్ను భారాలు ప్రజలపై వేస్తున్నాయని వాపోయారు. రాష్ట్రంలో అధికారం చేపట్టిన టిడిపి కూటమి ప్రభుత్వం సూపర్‌సిక్స్ పథకాలు అమలు చేయడం లేదన్నారు. కర్నూల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన క్లాప్ ఆటోలు ఉండటం వలన ఇంటి దగ్గర నుండి చెత్త సేకరించి కర్నూలు నగరాన్ని పరిశుభ్రంగా ఉంచేవన్నారు. మున్సిపల్ కార్పొరేషన్‌ను రాష్ట్ర ప్రభుత్వం సరిగా పట్టించుకోకపోవడం వలన రెడ్డి ఏజెన్సీ వారు ఫైనాన్సయర్ల అప్పు చెల్లించకపోవడం వలన ఆటోలు జప్తు చేసుకొని తీసుకెళ్లడంతో కర్నూల్ నగరం చెత్త మయంగా మారిందన్నారు. నగర ప్రజలు అనారోగ్యానికి గురయ్యే పరిస్థితి ఉందని గుర్తు చేశారు. ప్రభుత్వం వారు మున్సిపల్ పాలకపక్షం కర్నూలు నగర ప్రజల ఆరోగ్యం కోసం చెత్త సేకరించ డానికి వంద ఆటోలు కొనుగోలు చేసి క్లాప్ డ్రైవర్లకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో నగర ప్రజలను పెద్ద ఎత్తున సమీకరించి ఈనెల 26న మున్సిపల్ కార్పొరేషన్ ఆఫీస్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. సిపిఎం నగర నాయకులు రాముడు, ఆర్.చంద్ర, కె.సుధాకర్, జాకీ, శాంతన్న, ప్రకాష్, ప్రసాద్, జి.బజార్, రాజశేఖర్, రమేష్ ,బాలరాజు, దేవరాజ్, కె. శీను ,బి వెంకటేశ్వర్లు, వినయ్, ప్రకాష్ ,సాయి, మద్దిలేటి, ఆలీ, ఎం.రాజు, ఎన్.రాజు ,శరత్,షాలు , హమాలి కార్మికులు కార్యకర్తలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిపిఎం పాతనగర కార్యదర్శి ఎం.రాజశేఖర్

శిథిలమైన వంటగది ..స్పందించని అధికారులు

ప్రజాశక్తి సి బెళగల్

మండలంలోని బురాన్ దొడ్డి ప్రాథమిక పాఠశాలలో వంటగది శిథిలమైంది. ఏడాది పాటుగా గోడలు నెర్రలు బారి, పెచ్చులూడి పడుతూ ఉంటే వంట చేయుటకు వంట నిర్వాహకులకు ఇబ్బందిగా మారింది. పధానోపాధ్యాయులు సి.సావిత్రి మండల అధికారులకు విన్నవించినా ప్రాథమికంగా స్పందన కరవయిందని ఆమె వాపోయారు. గతంలో కూడా తరగతి గదిలో పెచ్చులూడి ప్రమాదం జరిగిందన్నారు. విద్యార్థులకు తలకు గాయాలైన సంఘటనలు చోటుచేసుకున్నాయని అన్నారు. ఈ మధ్య పోలకల్ లో చెట్టు విరిగి పడి బాలిక మృతి చెందిందని, ఈ పాఠశాల ఆవరణలో ప్రమాదకరంగా ఉన్న ఈ వంట గదిని ఉన్నతాధికారులయినా తొలగించరా సారూ అంటూ అక్కడి ఉపాధ్యాయులు, పేరెంట్స్ తెలిపారు.

ఇఫ్తార్ విందులో మాజీ ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

కర్నూలు నగరం 48వ వార్డు గాఫురియా మసీద్‌లో వైసిపి నాయకులు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు కర్నూలు మాజీ ఎమ్మెల్యే ఎంఎ హఫీజ్‌ఖాన్ హాజరయ్యారు. స్థానిక వైసిపి నాయకులు కార్యకర్తలతో కలిసి ప్రార్థనలు నిర్వహించారు.

మాట్లాడుతున్న ఆవాజ్, ఎస్‌ఎఫ్ఐ నాయకులు

ఎయిడెడ్ పాఠశాలగా కొనసాగించాలి

ఆవాజ్, ఎస్‌ఎఫ్ఐ నాయకుల డిమాండ్

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్ : కర్నూలు నగరంలో ఉన్న ఉమర్ అరబిక్ పాఠశాలను ఎయిడెడ్ గా కొనసాగించాలని ఆవాజ్, ఎస్‌ఎఫ్ఐ నగర అధ్యక్ష కార్యదర్శులు ఇక్బాల్ ,షరీఫ్, అబూబకర్,సాయి ఉదయ్ లు డిమాండ్ చేశారు. మంగళవారం నగరంలోని ఆవాజ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఉమర్ అరబిక్ పాఠశాలకు ఎన్నో ఏళ్ల చరిత్ర ఉందన్నారు. ముస్లిం మైనార్టీ విద్యార్థులకు విద్యా అందించేందుకు ఈ పాఠశాలను నెలకొల్పారన్నారు. ఈ పాఠశాలకు ఎయుడెడ్ హోదా కల్పించే ప్రభుత్వం అన్ని సదుపాయాలు కల్పించాలని వారు డిమాండ్ చేశారు. ఈ పాఠశాలను ప్రైవేటీకరణ చేసే ఆలోచనను ఇప్పటికైనా విరమించుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో విద్యార్థులను, పూర్వ విద్యార్థులను, మేధావులను కలుపుకొని పాఠశాలల పరిరక్షణ కోసం ఉద్యమిస్తామని హెచ్చరించారు.


రైతులతో మాట్లాడుతున్న జెసి నవ్య

శనగ రైతులను ప్రభుత్వం ఆదుకుంటుంది

- జెసి డాక్టర్ నవ్య

ప్రజాశక్తి - ఆలూరు

ప్రభుత్వం పప్పు శనగ రైతులను ఆదుకుని న్యాయం చేసేందుకు కృషి చేస్తోందని జెసి డాక్టర్ నవ్య తెలిపారు. మంగళవారం ఆలూరు మండలం హత్తిబెళగల్ గ్రామ రైతు సేవా కేంద్రంలో మార్క్‌ఫెడ్, నాఫెడ్ ఆధ్వర్యంలో పప్పు శనగ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. రైతులు పండించిన పప్పు శనగకు ప్రభుత్వం మద్దతు ధర రూ.5,650లుగా నిర్ణయించిందని తెలిపారు. రైతులు రైతు సేవా కేంద్రాల్లో శనగను విక్రయించేందుకు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని చెప్పారు. భూములు ఆన్‌లైన్‌లో మిగులు భూములుగా చూపడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని గ్రామంలోని రైతులు జెసి దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయంలో అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో భూసమస్యలను పరిష్కరించేందుకు ఆధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఆర్‌డిఒ భరత్ నాయక్, తహశీల్దార్ గోవింద్ సింగ్, ఆర్ఐ బసవన్న గౌడ్, విఆర్‌ఒ అమరేశ్వర రెడ్డి, మార్క్ ఫెడ్ జిల్లా మేనేజర్ రాజు, కెడిసిఎంఎస్ బిజినెస్ మేనేజర్ రాజేష్ పాల్గొన్నారు.

తాగు నీటి ఎద్దడి నివారణకు చర్యలు

- ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

ప్రజాశక్తి - ఆదోని

వేసవి నేపథ్యంలో ప్రజలకు తాగునీటి సరఫరాలో ఎలాంటి అంతరాయమూ కలుగకుండా చర్యలు చేపట్టాలని ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో తాగునీటి సరఫరా అంశాలపై ఎంపిడిఒలు, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వేసవిలో తాగునీటి అవసరాలు పెరగనున్న దృష్ట్యా ముందస్తు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రజలకు తగినంత మోతాదులో తాగునీరు అందించేందుకు ప్రతి గ్రామంలోనూ ఉన్న నీటి వనరులను పర్యవేక్షించాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో నీటి కొరత ఏర్పడితే ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయాలని, దీనికి అవసరమైన ప్రణాళికను అధికారులు సిద్ధం చేయాలని ఆదేశించారు. తాగునీటి సమస్యపై పత్రికల్లో వచ్చిన వార్తలను క్షేత్రస్థాయిలో సంబంధిత అధికారులు తనిఖీ చేసి సమస్యను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

కంట్రోల్ రూమ్ ఏర్పాటు

గ్రామంలో తాగునీటి సమస్య తలెత్తితే డివిజన్ స్థాయిలో కంట్రోల్ రూమ్, గ్రామీణ నీటిపారుదల శాఖ వారి కార్యాలయంలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గ్రామంలో తాగునీటి సమస్య వస్తే 9704643236, 7892264314 ఫోన్ నెంబర్లకు సంప్రదించవచ్చని తెలిపారు. ఆర్‌డబ్ల్యుఎస్ ఈఈ పద్మజ పాల్గొన్నారు.

పాఠశాల భవనం పూర్తి చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

మండలంలోని పాండవగల్ గ్రామంలో 2023లో నాడు-నేడు కింద ప్రారంభించిన పాఠశాల భవనాన్ని పూర్తి చేసి విద్యార్థులకు ఉపయోగపడే విధంగా చేయాలని సిపిఎం మండల కార్యదర్శి కెలింగన్న డిమాండ్ చేశారు. ఆగిపోయిన పాఠశాల భవనాన్ని మంగళవారం సిపిఎం ఆధ్వర్యంలో పరిశీలించి మాట్లాడారు. రూ.లక్షలు వెచ్చించి భవన నిర్మాణాన్ని ప్రారంభించి మధ్యలో వదిలేయడం వల్ల ప్రజాధనం వృథా అవుతుందని విమర్శించారు. కంకర, స్టీలు, ఇతర సామగ్రి ఎక్కడకక్కడ ఉందని, ప్రభుత్వం వెంటనే నిధులు మంజూరు చేసి పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. సిపిఎం మండల నాయకులు పాండురంగ, శాఖ కార్యదర్శి కె.గోవిందు, విద్యా కమిటీ ఛైర్మన్ తాయన్న, పార్టీ సభ్యులు హనుమంతు రెడ్డి, గ్రామస్తులు ఆంజనేయ, వీరేష్, తిక్కప్ప, తాయన్న పాల్గొన్నారు.

ఆగిపోయిన నిర్మాణాన్ని పరిశీలిస్తున్న నాయకులు

బ్రిడ్జి నిర్మాణ పనులను పూర్తి చేయాలి

- సిపిఎం పట్టణ కార్యదర్శి గోవిందు

- ప్రజా చైతన్య యాత్ర

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

బ్రిడ్జి నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేయాలని సిపిఎం పట్టణ కార్యదర్శి పి.గోవిందు, సిపిఎం పట్టణ కమిటీ సభ్యులు రాముడు, లక్ష్మీ నరసయ్య, రమేష్ డిమాండ్ చేశారు. మంగళవారం సిపిఎం ప్రజా చైతన్య యాత్రలో భాగంగా పట్టణంలోని బైపాస్ రోడ్డు, తాయమ్మ కాలనీ, హబీబ్ ముబారక్ నగర్, దోబీగాట్ ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈ కాలనీలకు అర్ధరాత్రి 1 గంట సమయంలో తాగునీరు వస్తున్నాయని, 40 ఏళ్ల క్రితం వేసిన పైపులైను ఇప్పటికీ మార్చలేదని తెలిపారు. జనాభాకు అనుగుణంగా తాగునీటి సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కురువ కల్యాణ మండపం దగ్గర బ్రిడ్జి నిర్మాణ పనులు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయని, నిర్మాణం పూర్తి కాకపోవడంతో స్థానికులు ఇబ్బందులకు గురవుతున్నారని చెప్పారు. బ్రిడ్జికి అనుబంధంగా ఉన్న రోడ్డును కూడా వెంటనే నిర్మించాలని, దీన్ని కర్నూలు రోడ్డుతో కలపాలని కోరారు. పట్టణంలోని వీధుల నుంచి చేరుతున్న మురుగునీరు చాకిరేవు వంకలోకి రావడం వల్ల చుట్టుపక్కల ఉన్న ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారని తెలిపారు. దీనికి వెంటనే సేఫ్టీ వాల్స్ నిర్మించి దుర్వాసన రాకుండా, దోమలను నివారించాలని డిమాండ్ చేశారు. 15వ వార్డులోని ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులు ఈ మురుగునీటి వల్ల దోమలు, దుర్గంధంతో వ్యాధుల బారిన పడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. రోడ్లు, డ్రెయినేజీ మౌలిక వసతులు లేవని, మున్సిపల్ అధికారులను కలిసిన ప్రతిసారీ 'టెండర్లు అయిపోయాయి. త్వరగా పనులు మొదలు పెడతామ'ని చెబుతున్నారని, ఇంతవరకు నిర్మాణాలను పూర్తి చేయలేదని తెలిపారు. ప్రభుత్వం, అధికారులు, మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి కాలనీలో ప్రజా సమస్యలను పరిష్కరించాలని కోరారు. నామాల రాముడు, తెలుగు మాదన్న, చంద్రన్న పాల్గొన్నారు. **ఆస్పరిలో**ని సుందరయ్య భవనం నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు మండల కార్యదర్శి వర్గసభ్యులు రంగస్వామి అధ్యక్షతన ర్యాలీగా వెళ్లి ధర్నా చేపట్టారు. సిపిఎం మండల కార్యదర్శి బాలకృష్ణ మాట్లాడుతూ... పందికోన రిజర్వాయర్ నుంచి ఆస్పరి, ముత్తుకూరు, వెంగళాయిదొడ్డి చెరువులకు నీరందించాలని డిమాండ్ చేశారు. అనంతరం తహశీల్దార్ రామేశ్వర్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. సిపిఎం మండల కార్యదర్శి వర్గసభ్యులు రామాంజనేయులు, మండల కమిటీ సభ్యులు మధుసూదన్ రెడ్డి, ఈరన్న, రవి, సీనియర్ నాయకులు మాణికప్ప, పెద్ద రంగన్న, నరసింహులు, శాఖ కార్యదర్శులు నరేంద్ర, ఈరన్న, తిప్పన్న, చిన్న మల్లేష్, శివప్ప, సూరి, వీరేష్, డివైఎఫ్ఐ నాయకులు వెంకటేష్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఎమ్మిగనూరులో సమస్యను తెలుపుతున్న సిపిఎం నాయకులు

ఆస్పరిలో ధర్నా చేపడుతున్న సిపిఎం నాయకులు

నీటి ఎద్దడిపై ఈఈ ఆగ్రహం

- ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ, పంచాయతీ కార్యదర్శులకు చీవాట్లు

ప్రజాశక్తి - మంత్రాలయం

మండలంలోని కల్లుదేవకుంట గ్రామంలో గత 20 రోజులుగా నెలకొన్న నీటిఎద్దడిపై ఆర్‌డబ్ల్యుఎస్ ఈఈ పద్మజ ఆగ్రహం వ్యక్తం చేశారు. నీటి ఎద్దడిపై గ్రామస్తుల ఆందోళన నిర్వహించగా ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ వెంకటరాముడు, గ్రామ కార్యదర్శులను మందలించారు. మంగళవారం గ్రామస్తులు రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేసి వాహనాల రాకపోకలను స్తంభింపజేసిన విషయం తెలుసుకున్న ఆమె కల్లుదేవకుంట గ్రామాన్ని సందర్శించారు. గ్రామస్తులు, అధికారులతో సమావేశం నిర్వహించారు. గత 20 రోజులుగా నీటి సరఫరా నిలిచిపోయిందని గ్రామస్తులు ఆమె దృష్టి తీసుకెళ్లారు. ఎందుకు నీటి సరఫరా బంద్ అయిందని ఆర్‌డబ్ల్యుఎస్ డిఇ మోహినుద్దీన్‌ను ప్రశ్నించారు. తమ దృష్టికి ఎందుకు తీసుకురాలేదని మండిపడ్డారు. ప్రతి గ్రామానికీ ఎన్ని గంటలు తాగునీరు వదులుతున్నారని ఎఇ, కాంట్రాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. పాత పైపులైన్ కావడం వల్ల లీకేజీలు అవుతున్నాయని, తాగునీటి సమస్య ఏర్పడుతుందని కాంట్రాక్టర్లు భీమయ్య వారికి వివరించారు. ఇలాంటివి పునరావృతమైతే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఒక నెలలోపు తాగునీటి సమస్యను పరిష్కరిస్తామని గ్రామస్తులకు హామీ ఇచ్చారు. వేసవి కాలంలో నీటి ఎద్దడి లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. తహశీల్దార్ రవి, సిఐ రామాంజులు, ఎస్ఐ శివాంజుల్, మంత్రాలయం సర్పంచి భీమయ్య పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఈఈ పద్మజ

ఏప్రిల్ చివరి వరకు సాగునీరందించాలి

- సబ్ కలెక్టర్‌కు రైతు సంఘం వినతి

ప్రజాశక్తి - కౌతాళం

తుంగభద్ర దిగువ కాలువకు ఏప్రిల్ చివరి వరకు సాగునీరు అందించాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వెంకటేశులు, జిల్లా ఉపాధ్యక్షులు మల్లయ్య కోరారు. మంగళవారం ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. తుంగభద్ర దిగువ కాలువకు మార్చి చివరి వరకే సాగునీరు సరఫరా అవుతాయని అధికారులు చెప్పడంతో రైతులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. దిగువ కాలువ కింద వేల ఎకరాల్లో వరి పంట సాగయిందని, మార్చి చివరికి సాగునీరు బంద్ అయితే పొట్ట దశలో ఉన్న వరి పంట పూర్తిగా దెబ్బతిని రైతులు నష్టపోయే ప్రమాదం ఉందని చెప్పారు. ఏప్రిల్ చివరి వరకు సాగునీరు అందించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై సబ్ కలెక్టర్ అధికారులతో చర్చించి రైతులకు న్యాయం జరిగేలా చూస్తామని హామీఇచ్చారు. రైతు సంఘం నాయకులు అయ్యప్ప, తిక్కప్ప, దావీదు, ఈరన్న పాల్గొన్నారు.

సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఎస్ఐ దిలీప్ కుమార్ బదిలీ

ప్రజాశక్తి - ఆలూరు

ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఎస్పీ విక్రమ్ పాటిల్ ఆదేశాలతో మంగళవారం ఎస్ఐల బదిలీ చేపట్టారు. ఆలూరు ఎస్ఐ దిలీప్ కుమార్ హోళగుందకు బదిలీ అయ్యారు. హోళగుంద ట్రెయినీ ఎస్ఐ షేక్ మహబూబ్ బాష ఎస్ఐగా భాద్యతలు చేపడుతున్నట్లు తెలిసింది.

ఎస్ఐ దిలీప్ కుమార్ బదిలీని ఆపాలి : ఎస్ఐ దిలీప్ కుమార్ బదిలీని ఆపాలని సిపిఎం నాయకులు కెపి.నారాయణ స్వామి, షాకీర్ కోరారు. ఆలూరులోని జ్యోతిబసు భవన్‌లో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఆలూరులో ప్రజలకు అందుబాటులో ఉండి శాంతిభద్రతలను పరిరక్షిస్తూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ జరగకుండా కట్టడి చేయడంలో ముందున్నారని తెలిపారు. అనతి కాలంలోనే 5 నెలల్లోపు బదిలీ చేయడం ఏమిటని ప్రశ్నించారు. ఎలాంటి భేదాభిప్రాయాలు లేకుండా అందరికీ న్యాయం చేసే వ్యక్తిగా, అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి అందరిలో చైతన్యం తీసుకు రావడానికి కృషి చేశారని తెలిపారు. బదిలీని ఆపాలని కోరారు. కృష్ణ, విఠల్, నాగరాజు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నారాయణ స్వామి

అవినీతిపై ఉక్కుపాదం..!

- రూ.3,17,607 అవినీతి సొమ్ము రికవరీకి ఆదేశం

- రూ.93 వేలు జరిమానా విధించిన పీడీ

- అవినీతి సొమ్మును కక్కిస్తాం - సామాజిక తనిఖీ బృందం

ప్రజాశక్తి - పెద్దకడబూరు

ఉపాధి హామీ చట్టం పేద గ్రామీణ కూలీల నిమిత్తం అమలవుతోందని, అవినీతి, అక్రమాలు చేయడానికి కాదని డ్వామా పీడీ వెంకట రమణయ్య హితవు పలికారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఎంపిడిఒ నాగరాజు స్వామి ఆధ్వర్యంలో ఏపీడీ లోకేశ్వర్ అధ్యక్షత సామాజిక తనిఖీ బహిరంగ సభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఉపాధి హామీ పనులను బినామీలు లేకుండా కచ్చితమైన కొలతలతో చేయిస్తే నిజమైన కూలీకి మంచి వేతనం లభిస్తుందని, ఈ దిశగా ఉపాధి సిబ్బంది పని చేయాలని సూచించారు. ఉపాధి పనుల్లో అవినీతి, అక్రమాలకు పాల్పడితే కక్కిస్తామని హెచ్చరించారు. ఉపాధిలో జరిగిన అవినీతి సొమ్ము రూ.3,17,607లను రికవరీ చేయాలని, లేకపోతే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని తెలిపారు. జరిమానా రూపంలో విధించిన రూ.93 వేలు చెల్లించాలని ఆదేశించారు. మండలంలోని వివిధ గ్రామాల్లో ఏప్రిల్ 1, 2023 నుంచి మార్చి 31, 2024 వరకు 717 పనులకు రూ.29.40 కోట్ల పనులు ఉపాధి, పిఆర్, ఆర్‌డబ్ల్యుఎస్, ఎస్ఎస్ఎలకు సంబంధించిన పనులు చేపట్టారు. వీటిపై ఈనెల 1 నుంచి 17 వరకు ఎస్ఆర్‌పి విజయ భాస్కర్ ఆధ్వర్యంలో సామాజిక తనిఖీ బృందాలు తనిఖీలు చేశాయి. బృందాలు గుర్తించిన అవినీతి, అక్రమాలను డ్వామా పీడీ వెంకట రమణయ్య పంచాయతీల వారీగా వెల్లడించారు. ఉపాధి హామీ చట్టంలో రూ.3,17,607 అవినీతి సొమ్మును రికవరీ చేయాలని, రూ.93 వేలు జరిమానా రూపంలో చెల్లించాలని పీడీ ఆదేశించారు. అడిషనల్ పీడీ మాధవి లత, ఏపీవోలు చంద్రశేఖర్, రామన్న, ఈసీ ఖాదర్ బాషా పాల్గొన్నారు.

సామాజిక తనిఖీ నిర్వహిస్తున్న సిబ్బంది

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

- మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని మున్సిపల్ కమిషనర్ ఎన్.గంగిరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని శ్రీనివాస సర్కిల్, కమిటీ రోడ్డు, లక్ష్మి పేట ప్రాంతాల్లో పారిశుధ్య పనులు పరిశీలించారు. అలాగే పట్టణంలోని గంజిహళ్లి రోడ్డులో డ్రెయినేజీ పూడిక తీత పనులు పరిశీలించారు.

అవినీతి నిర్మూలించాలని నిరసన

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

ఆదోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అవినీతిని నిర్మూలించాలని మంగళవారం జనసేన పార్టీ నాయకులు నిరసన చేపట్టారు. స్టాంప్ పేపర్ అమ్మే దగ్గర నుంచి ప్లాట్ల రిజిస్ట్రేషన్ వరకు పేదలను పీడిస్తున్నారని జనసేన మండల అధ్యక్షుడు తాహెర్ వలీ ఆగ్రహం వ్యక్తం చేశారు. సబ్ రిజిస్ట్రార్ అరుణ్ కుమార్‌కు కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. అవినీతికి పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

భోజనానికి వెళ్తున్న వారిని అరెస్టు చేయడం దారుణం

- ఎపిడికెఎస్ జిల్లా కార్యదర్శి కరుణాకర్

ప్రజాశక్తి - గోనెగండ్ల

సమస్యలు పరిష్కరించాలని విజయవాడ ధర్నా చౌక్‌లో చేపట్టిన ధర్నా అనంతరం మధ్యాహ్నం భోజనానికి వెళ్తున్న డప్పు కళాకారులను, కెవిపిఎస్ నాయకులను అరెస్టు చేయడం దారుణమని ఎపిడికెఎస్ జిల్లా కార్యదర్శి బి.కరుణాకర్ విమర్శించారు. మంగళవారం ఆయన మాట్లాడారు. డప్పు కళాకారుల సమస్యలు పరిష్కరించాలని శాంతియుతంగా ధర్నా నిర్వహించి, అనంతరం భోజనానికి వెళ్తున్న డప్పు కళాకారులను, కెవిపిఎస్ నాయకులను అరెస్టు చేయడం దుర్మార్గమైన చర్య అని అన్నారు. అరెస్టు చేసిన వారిని విడుదల చేయాలని, డప్పు కళాకారుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. డప్పు కళాకారుల సంఘం మండల కార్యదర్శి మారేష్, నాయకులు మునియప్ప, రంగస్వామి, మద్దిలేటి, హనుమంతు, రామన్న, ముత్యాలు పాల్గొన్నారు.

సర్వేలు త్వరగా పూర్తి చేయాలి

- మండల ప్రత్యేకాధికారి నారాయణ మూర్తి

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రజల సంక్షేమం కోసం చేపట్టనున్న సర్వేలను త్వరగా పూర్తి చేయాలని మండల ప్రత్యేకాధికారి కె.నారాయణ మూర్తి అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక వైకెపి కార్యాలయంలో ఎంపిడిఒ రాధ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. గ్రామాల కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు, విలేజ్ సర్వేయర్లు బాధ్యతగా భావించి ఎంఎస్ఎంఇ, ఈకేవైసీ, తదితర సర్వేలు నిర్వహించాలని కోరారు. లేకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఎన్‌టిఆర్ సుజల స్రవంతి ప్లాంట్ ధ్వంసం

ప్రజాశక్తి - నందవరం

కనకవీడు గ్రామంలో ఎన్‌టిఆర్ సుజల స్రవంతి ప్లాంట్‌ను ఆకతాయిలు ధ్వంసం చేసినట్లు నిర్వాహకులు మంగళవారం తెలిపారు. ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఏర్పాటు చేసిన ప్లాంట్‌ను ఆకతాయిలు ధ్వంసం చేయడం వల్ల మిషన్ పనిచేయకుండా ఆగిపోయింది. నేటి నుంచి తాగునీరు లేక ప్రజలు ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తుంది. ఈ సంఘటనపై పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. సంఘటన స్థలాన్ని సందర్శించి విచారణ చేపడతామని పోలీసులు తెలిపారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - నందవరం

విద్యుదాఘాతానికి గురై వ్యక్తి మృతి చెందారు. కుటుంబ సభ్యుల వివరాల మేరకు... మండలంలోని ఇబ్రహీంపురం గ్రామానికి చెందిన చాకలి శ్రీనివాసులు కుమారుడు చాకలి నరసప్ప విద్యుదాఘాతానికి గురై మృతి చెందారు. శ్రీనివాసులు భార్య ఊరు అయిన కర్ణాటక రాష్ట్రం మట్టమర్రి గ్రామంలో పండ్ల జ్యూస్ బండి పెట్టుకొని జీవనం కొనసాగిస్తున్నారు. రోజు మాదిరిగానే శనివారం జ్యూస్ వ్యాపారం చేసుకొని రాత్రి 10 గంటల సమయంలో కాలకృత్యాలు తీర్చుకోవడానికి వెళ్లగా అక్కడ విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందారు. మృతునికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఆయన మృతితో కుటుంబం శోకసంద్రంలో మునిగింది. కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని మంగళవారం గ్రామస్తులు కోరారు.

బ్రాహ్మణ సంక్షేమానికి కృషి

- ఎపి బ్రాహ్మణ సంక్షేమ సమైక్య రాష్ట్ర అధ్యక్షులు వెంకటరామరాజు

ప్రజాశక్తి - మంత్రాలయం

బ్రాహ్మణ సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎపి బ్రాహ్మణ సంక్షేమ సమైక్య రాష్ట్ర అధ్యక్షులు వెంకటరామరాజు పేర్కొన్నారు. మంగళవారం ఆయన స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత వైసిపి ప్రభుత్వం బ్రాహ్మణుల సంక్షేమాన్ని, బ్రాహ్మణ కార్పొరేషన్‌ను పూర్తిగా నిర్వీర్యం చేసిందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం హామీలో భాగంగా బ్రాహ్మణుల సంక్షేమానికి కట్టుబడి ఉందని తెలిపారు. బ్రాహ్మణులకు ఇచ్చిన హామీ మేరకు బ్రాహ్మణ అర్చకులకు ధూప దీప నైవేద్యాలకు రూ.5 వేల నుంచి రూ.10 వేలకు పెంచినట్లు చెప్పారు. ఆలయ అర్చకులకు వేతనాలు రూ.10 వేల నుంచి రూ.15 వేలకు పెంచిన ఘనత కూటమి ప్రభుత్వానికి దక్కుతుందని కొనియాడారు. ఎపి బ్రాహ్మణ సంక్షేమ సమైక్య రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఎంకె.నాగరాజు స్వామి, రామకృష్ణారావు పాల్గొన్నారు.

భానుడి భగభగలు...

- పెరుగుతున్న ఎండలు

- వడదెబ్బ బారిన పడకుండా జాగ్రత్తలు అవసరం - వైద్యాధికారి శ్రీలేఖ

ప్రజాశక్తి - నందవరం

మండలంలో ఎండలు భగభగమంటున్నాయి. ఎండ వేడికి కూలీలు, ప్రయాణికులు, విద్యార్థులు, ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో ఎండల తీవ్రత ఎక్కువైంది. ఉదయం 8 గంటల నుంచే భానుడు ప్రజలపై తన ప్రతాపాన్ని చూపిస్తున్నాడు. ఎండల వేడికి ప్రజలు అల్లాడిపోతున్నారు. ఉపాధి హామీ పనికి వెళ్లే కూలీలు ఎండకు వెళ్లి, రావడానికి ఇబ్బంది పడుతున్నారు. పొలం పనులకు వెళ్లే రైతులు ఎండ తీవ్రతకు అల్లాడిపోతున్నారు. మిరప తెంపడానికి వెళ్లే కూలీలను ఎండ తీవ్రత, మిరప వేడి రెండు కలిపి నలిపేస్తున్నాయి. వివిధ గ్రామాలకు ప్రయాణించే వారు వాహనాల కోసం ఎండలో వేచి ఉండి, ఉద్యోగులు తమ విధులను నిర్వహించే క్రమంలో ఎండవేడితో ఇబ్బందులు పడుతున్నారు.

ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

వడదెబ్బ బారిన పడకుండా జాగ్రత్త వహించాలి

- మండల వైద్యాధికారి శ్రీలేఖ

ప్రజలు వడదెబ్బ బారిన పడకుండా జాగ్రత్త తీసుకోవాలి. ఎండల తీవ్రత, వడగాల్పులు ఎక్కువగా ఉన్నాయి. చిన్నపిల్లలు, వృద్ధులు దీర్ఘకాలిక వ్యాధులు ఉన్న వారు ఎక్కువ సమయం బయటకు వెళ్లకుండా ఇంట్లోనే ఉండాలి. పొలం పనులకు వెళ్లే కూలీలు 11 గంటలకే ఇంటికి చేరుకోవాలి. విద్యార్థులు మధ్యాహ్నం స్కూల్ నుంచి ఇంటికి వచ్చిన వెంటనే చల్లనీటితో స్నానం చేసి ఆరోగ్యాన్ని సంరక్షించుకోవాలి. విద్యార్థుల పట్ల తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలి. పరీక్షలు సమయం కావడంతో విద్యార్థులు ఇబ్బందులు పడే అవకాశం ఉంది. విద్యార్థుల వసతి గృహాల్లో ఒఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలి. విద్యార్థులు ఎండ తీవ్రతకు నీరసం రాకుండా ఒఆర్ఎస్ వాడుతూ ఉండాలి. ప్రజలు వడదెబ్బ తగిలితే వెంటనే వైద్యులను సంప్రదించాలి. వేడిని తట్టుకోవడానికి ఎక్కువగా నీరు, మజ్జిగ తీసుకోవాలి.

సమన్వయంతో పురోగతి

- ప్రత్యేకాధికారి, డిప్యూటీ కలెక్టర్ అనురాధ

ప్రజాశక్తి - చిప్పగిరి

ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చిన సర్వేలన్నీ సకాలంలో పూర్తి చేయాలంటే అధికారులందరూ సమన్వయంతో ముందుకెళితే పురోగతి సాధ్యమని, అప్పుడే వంద శాతం పూర్తి చేయగలమని మండల ప్రత్యేకాధికారి, డిప్యూటీ కలెక్టర్ అనురాధ తెలిపారు. మంగళవారం మండల కార్యాలయంలో ఎంపిడిఒ అల్లా బకాష్ అధ్యక్షతన మండల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ప్రభుత్వం ఇచ్చిన సర్వేలన్నీ అలసత్వం వహించకుండా సకాలంలో పూర్తి చేయాలని, లేకపోతే శాఖపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అధికారులు ఏ ఆదేశాలు ఇచ్చినా సకాలంలో స్పందించి సమాధానం చెప్పే విధంగా ఉండాలని తెలిపారు. ఐహెచ్ఎల్‌లో పురోగతి సాధించాలన్నారు. ఉన్న వాటిని త్వరగా జియో టాగింగ్ చేసి బిల్లులు పెట్టాలని తెలిపారు. మిస్సింగ్ సిటిజెన్ సర్వేలన్నీ త్వరగా పూర్తి చేయాలన్నారు. ఐసిడిఎస్‌కు సంబంధించిన చిన్నపిల్లల ఆధార్ క్యాంపులను త్వరగా పూర్తి చేయాలన్నారు. గృహ నిర్మాణ శాఖ, పంచాయతీల్లో జరుగుతున్న అభివృద్ధి పనులు, ఉపాధి హామీ పనులు వేగవంతం చేసి పురోగతి సాధించాలని తెలిపారు. తహశీల్దార్ ఇజాజ్ అహ్మద్, పిఆర్ ఎఇ సోమప్ప, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ మల్లికార్జున్ రెడ్డి, ఇఒఆర్‌డి బాలన్న, ఎంఇఒ సావిత్రి, ఎంసిఒ వెంకటేశులు, ఎపిఎం నాగార్జున, ఏపీవో జుబేర్ అహ్మద్, సూపర్‌వైజర్ ప్రసూన, హౌసింగ్ ఎఇ భవ్య, ఆస్పిరేషనల్ అధికారి నరసింహులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న అనురాధ

ఈకేవైసీ తప్పనిసరి : తహశీల్దార్

ప్రజాశక్తి- దేవనకొండ

రేషన్ కార్డులోని ప్రతి సభ్యుడూ తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకునేలా రేషన్ దుకాణ డీలర్లు ప్రత్యేక చొరవ తీసుకోవాలని తహశీల్దార్ ప్రసాదరాజు సూచించారు. మంగళవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో రేషన్ డీలర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రేషన్ కార్డులో ఉన్న సభ్యులందరీ ఈకేవైసీ పెండింగ్ లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఎస్సీ వర్గీకరణ తొలి అడుగు చంద్రబాబుదే

- చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేసిన మాదిగలు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

షెడ్యూల్డ్ కులాల ఉమ్మడి రిజర్వేషన్లలో ఎబిసిడి వర్గీకరణను అమలు చేసి ఎస్సీ 59 ఉప కులాలకు సామాజిక న్యాయం పాటించిన ఘనత, తొలి అడుగు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుదేనని టిడిపి నాయకులు కదిరికోట ఆదెన్న పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహం దగ్గర అంబేద్కర్, డాక్టర్ జగ్జీవన్ రామ్, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చిత్రపటాలకు ఆదెన్న ఆధ్వర్యంలో మాదిగలు పాలాభిషేకం చేశారు. ముందుగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మిఠాయిలు పంచుకొని బాణసంచా పేల్చి సంబరాలు జరుపుకున్నారు. రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణను అమలు చేయడానికి రాష్ట్రాన్ని యూనిట్‌గా తీసుకోవడం శుభ పరిణామమని తెలిపారు. టిడిపి సీనియర్ నాయకులు రోజా ఆర్ట్స్ ఉసేని, కె.తిమ్మాపురం మార్క్, ఎస్.సాల్మన్, వన్నెల మోష, జాలవాడి ఏసన్న, జగతాప్ జయపాల్, ఆటో చిన్న, టి.ఈరన్న, సురేష్, కె.సుధాకర్, జె.బాబు, ఎం.శాంతిరాజు, మారెప్ప పాల్గొన్నారు.

పాలాభిషేకం చేస్తున్న మాదిగలు

చంద్రబాబుకు ఎంఆర్‌పిఎస్ ధన్యవాదాలు

ఎస్సీ వర్గీకరణ అమలుకు ఏర్పాటైన రిటైర్డ్ ఐఎఎస్ అధికారి రాజీవ్ రంజన్ మిశ్రా ఏక సభ్య కమిషన్ ప్రభుత్వానికి సమర్పించిన నివేదికను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలో జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో ఆమోదిస్తూ నిర్ణయం తీసుకోవడం పట్ల ఎంఆర్‌పిఎస్ నాయకులు ముఖ్యమంత్రి చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపారు. ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర కార్యదర్శి జి.ఆనంద్ చైతన్య మాదిగ, జిల్లా ఉపాధ్యక్షులు గంజహళ్లి మహదేవ్ మాదిగల ఆధ్వర్యంలో పట్టణంలోని ఎంఆర్‌పిఎస్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. చంద్రబాబుకు మంద కృష్ణ మాదిగ నాయకత్వంలో మాదిగలు రుణపడి ఉంటారని తెలిపారు. నాయకులు ఏబు, ప్రకాశం, సాల్మన్, దేవేంద్ర, ఏసుదాసు, నతానీయేలు, నాయకులు దేవపాల్, నరసప్ప, చిన్న భీమన్న, ఆరెకంటి జయరాజు పాల్గొన్నారు.

కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

- తిక్కారెడ్డికి ఉద్యోగుల వినతి

ప్రజాశక్తి - ఆదోని

ఇంజినీరింగ్ కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని, ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను నెరవేర్చాలని మున్సిపల్ ఇంజినీరింగ్ కాంట్రాక్టు ఉద్యోగులు డిమాండ్ చేశారు. మంగళవారం టిడిపి జిల్లా అధ్యక్షులు తిక్కారెడ్డికి ఆదోనిలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నాయకులు అహ్మద్, సోమన్న, పీరా మాట్లాడారు. చాలీచాలని వేతనాలకు ఎన్నో ఏళ్లుగా మున్సిపాలిటీ ఇంజినీరింగ్ సెక్షన్‌లో విధులు నిర్వర్తిస్తున్నా మని తెలిపారు. ఎలక్ట్రిషన్, నీటి సరఫరా, మెకానిక్‌లు, కంప్యూటర్ ఆపరేటర్లుగా తక్కువ వేతనాలకు పని చేస్తున్నామన్నారు. నెలకు రూ.28 వేల వేతనం ఇవ్వాలని, పదేళ్ల సర్వీస్ పూర్తి చేసుకున్న వారిని రెగ్యులర్ చేయాలని కోరారు. విధులు నిర్వర్తిస్తూ చనిపోయిన వారి కుటుంబ సభ్యులకు ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులను రెగ్యులర్ చేస్తామని ఎన్నికల సందర్భంగా చంద్రబాబు, నారా లోకేష్, పవన్ కల్యాణ్ ఇచ్చిన హామీని గుర్తు చేశారు. గత ప్రభుత్వ హయాంలో సమ్మె చేసిన కాలానికి వేతనం ఇవ్వాలని కోరినా అప్పుడు పట్టించుకోలేదన్నారు. ఆయన స్పందించి... ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి కూడా తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. పాండురంగ, కైలాస్, రామాంజి, వీరేష్, శీన, బాష, వై.రామాంజి ఉన్నారు.

తిక్కారెడ్డికి వినతి పత్రం ఇస్తున్న ఉద్యోగులు

కాలువలో పడి మహిళా కూలీ మృతి

ప్రజాశక్తి - హాలహర్వి

కాలువలో పడి మహిళా కూలీ మృతి చెందిన సంఘటన మండలంలోని పచ్చరపల్లి గ్రామ శివారులో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు... ఆలూరు మండలం మొలగవల్లి గ్రామానికి చెందిన శ్రీదేవి (40) మంగళవారం పచ్చరపల్లి గ్రామం దగ్గర మిరప పంటను కోసేందుకు తోటి కూలీలతో పాటు వచ్చారు. మధ్యాహ్నం 1 గంటకు తన పనులు ముగించుకొని ఇంటికి వచ్చే సమయంలో పచ్చరపల్లి దగ్గర కాళ్లు కడుక్కుని నీళ్లు తాగాలని ఎల్ఎల్‌సిలోకి దిగారు. ప్రమాదవశాత్తు కాలు జారి కాలువలో పడ్డారు. శ్రీదేవి కాలువలో పడిపోవడంతో తోటి కూలీలు కేకలు వేశారు. పక్కనే ఉన్న వ్యక్తులు, ఆటో డ్రైవర్ మునిస్వామి బయటకు తీసుకు రావాలని ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయింది. శ్రీదేవి ఆచూకీ మాత్రం లభించలేదు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న హాలహర్వి ఎస్ఐ చంద్ర, పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. కాలువలో గల్లంతైన శ్రీదేవి విషయం స్థానికులను అడిగి తెలుసుకున్నారు. గజ ఈతగాళ్లను పిలిచి శ్రీదేవి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. గూళ్యం 48వ డీప్ సమీపంలో మృతదేహం పైకి రావడంతో.. వెంటనే గజ ఈతగాళ్లు దూకి మృతదేహాన్ని బయటికి తీశారు. పోస్టుమార్టం ఆస్పత్రికి తరలించారు. శ్రీదేవికి భర్త భగీరథ, నలుగురు సంతానం ఉన్నారు. కుమారుడు పదో తరగతి చదువుతున్నారు.

మారెమ్మ దేవర ఉత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి- దేవనకొండ

మండలంలోని గద్దెరాళ్ల మారెమ్మ దేవర ఉత్సవాలు మంగళవారం ప్రారంభమైనట్లు ఆలయ కార్య నిర్వహణాధికారి వీరయ్య తెలిపారు. పల్లెదొడ్డి గ్రామంలో సుంకులమ్మ, లింగమయ్యకు గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు నెత్తిపై బోనాలను పెట్టుకొని నైవేద్యాన్ని సమర్పించారు. మారెమ్మ దేవత ఆలయంలో భక్తాదులు ప్రత్యేక పూజలు చేశారు.